క్లుప్తంగా

మంత్రికి వినతి



మంత్రి పెద్దిరెడ్డితో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సోమశేఖర్

బంగారుపాళెం: ఐరాలలో మినీ మార్కెట్ యార్డు ఏర్పాటుకు సహకరించాలని శుక్రవారం ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్ తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, బంగారుపాళెం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఐరాలలో మినీ మార్కెట్ యార్డు ఏర్పాటుకు పాలక మండలి తీర్మానించిందని గుర్తుచేశారు. స్పందించిన మంత్రి మినీ మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మంత్రిని కలిసిన వారిలో పూజారి మోహన్‌రెడ్డి ఏఎంసీ కార్యదర్శి వెంకటరమణ, సూపర్‌వైజర్ గంగయ్య ఉన్నారు.

నేడు పట్టు వస్త్రాల సమర్పణ

బంగారుపాళెం: శ్రీమొగిలీశ్వరస్వామి వారికి శనివారం కాణిపాక వినాయకస్వామి దేవాలయం అధికారులు పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కాణిపాకం ఆలయం తరఫున పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలను స్వామి వారికి అందజేస్తారన్నారు. దీంతోపాటు మహాసముద్రం గ్రామంలోని పురాతన శివాలయం మహతీశ్వరస్వామి వారికి కాణిపాక ఆలయం తరఫున ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పూతలపట్టు: మండల కేంద్రంలో శుక్రవారం జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సోదరుడు రాధాకృష్ణ ప్రచారం చేశారు. పట్టభద్రులు మొదటి ఓటును పేర్నాటికి వేసి గెలిపించాలని కోరారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శ్లోక పుస్తకాల పంపిణీ



విద్యార్థినికి శ్లోక పుస్తకం అందజేస్తున్న ఇస్కాన్ నిర్వాహకులు

గుడిపాల: మండల కేంద్రంలోని సీఎస్ఆర్ కళాశాలలో శుక్రవారం వేలూరు ఇస్కాన్ శాఖ ఆధ్వర్యంలో శ్లోక పుస్తకాలను పంపిణీ చేశారు. దేవాలయ ఎండీ కమలకాంత్ మాట్లాడుతూ విద్యార్థులందరూ చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని సూచించారు. తద్వారా మానసిక ప్రశాంతత, సత్ప్రవర్తన అలవడుతుందని చెప్పారు. అనంతరం నిర్వహించిన భక్తి కీర్తనలు ఆకట్టుకున్నాయి. హరేరామ హరేకృష్ణ శ్లోక పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు.

కంప్యూటర్ శిక్షణ కేంద్రం తనిఖీ



చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయ్యూబ్ హుసేన్ శుక్రవారం నగరంలోని మైనారిటీ కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణ అమలుపై సమీక్షించినట్లు తెలిపారు. అనంతరం ముస్లిం నాయకులు డైరెక్టర్‌ను దుశ్శాలువతో సన్మానించారు. జిల్లా మైనారిటీశాఖ అధికారి చెన్నారెడ్డి, కార్పొరేటర్లు అను, సయ్యద్, వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ గఫ్ఫార్‌ఖాన్, ముక్తార్ అహ్మద్, మునీర్ అహ్మద్, ఎసానుల్లా తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ఉమామహేశ్వర రెడ్డి



తవణంపల్లె: పూతలపట్టు నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా మండలంలోని ఈచనేరి పంచాయతీ సర్పంచ్ ఉమామహేశ్వర రెడ్డిని ని యమించారు. ఈ మేరకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు శుక్రవారం ప్రకటించారు.

సచివాలయ కన్వీనర్‌గా హరికృష్ణారెడ్డి



తవణంపల్లె: మండల సచివాలయ కన్వీనర్‌గా సరకల్లు హరికృష్ణారెడ్డిని నియమిస్తూ శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు ప్రకటించారు. హరికృష్ణారెడ్డిని ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు శాలువ కప్పి సత్కరించారు.

మొగిలీశ్వరస్వామి క్షేత్రం



స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి



సింహంపై ఊరేగుతున్న స్వామి వారు



చిత్తూరు: విద్యుత్ వెలుగుల్లో అగస్త్యేశ్వర స్వామి ఆలయం



కైలాసవాసా.. ఈశా పరమేశా..

- నేడు శైవక్షేత్రాల్లో లింగోద్భవ దర్శనం
- శివరాత్రి మహోత్సవ ఏర్పాట్లు పూర్తి
- వేకువజాము నుంచే అభిషేకాలు

చిత్తూరు రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలకు నగరంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఆలయాలు, పరిసరాలను విద్యుత్ దీపాలంకరణలు, భారీ సెట్టింగులతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల రద్దీకి తగినట్లు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం నుంచి నగరంలోని శివాలయాల్లో శివరాత్రి పూజలు ప్రారంభం కానున్నాయి.

శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో..

స్థానిక నీవానది ఒడ్డున ఈశ్వరగుడి వీధిలో ప్రసిద్ధి చెందిన శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. శనివారం వేకువజామున పంచామృత అభిషేకంతో పూజలు ప్రారంభం కానున్నాయి. 8 గంటల నుంచి అభిషేకం, నాల్గవ కాలయాగపూజలు కొనసాగుతాయి. అర్ధరాత్రి లింగోద్భవ దర్శనం, అనంతరం నేపాల్ నుంచి తెప్పించిన స్ఫటిక లింగానికి అభిషేకాలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి శివకోటి భజన నిరంతరాయంగా ఉంటుందని అర్చకులు శివ, ఈఓ రమణ పేర్కొన్నారు. కట్టమంచిలో కొలువైన శ్రీ కుళందీశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు రుద్రాభిషేకంతో పాటు శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి 11.30 గంటలకు లింగోద్భవ కాలాన అభిషేకాలు, లక్ష పత్రిపూజ నిర్వహిస్తామన్నారు. ఇరువారంలోని శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, ప్రదోషపూజలు, ధూపదీపనైవేద్యం, మహా హారతి నిర్వహిస్తారు. సంతపేటలోని కుబేర ఉమామహేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరుగుతాయి. సత్యసాయి సేవా మందిరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రుద్రాభిషేకం, భక్తులచే పాలాభిషేకం జరుగుతాయి. గిరింపేటలోని చిదంబరేశ్వర స్వామి ఆలయంలో కలశ అభిషేకం, రుద్రాభిషేకం, దీపారాధనలు, నాల్గవ కాల అభిషేక పూజలు నిర్వహించనున్నారు.

భక్తజన బాంధవుడు మొగిలీశ్వరుడు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీమొగిలీశ్వరస్వామి భక్తజన బాంధవుడిగా, సంతాన ప్రదాయకుడిగా పూజలందుకుంటున్నారు. మొగిలీశ్వరాలయం అతిప్రాచీన శివాలయం. విశాలమైన ఆవరణలో రంగమండపం, ముఖమండపం, అంతరాళమండపం, గర్భగుడులతో శిల్పకళా శోభితమై అలారారుతోంది. గర్భాలయంలో శివుడు సర్వాలంకార భూషితుడై దర్శనమిస్తాడు. స్వయంభు శివలింగ దర్శనం భక్తులలో ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుంది. స్వామివారి గర్భాలయానికి ఎడమవైపున శ్రీస్వామివారి దేవేరి సంతాన ప్రదాయనిగా పేరొందిన శ్రీకామాక్షిదేవి గర్భాలయం ఉంది. ఆలయం ఆవరణలోని రంగమండపం, ప్రదక్షిణ మండపాల్లో దేవతలు కొలువై ఉన్నారు. కాశీ విశ్వేశ్వరుడు, విశాలాక్షి, సూర్యభగవానుడు, కాలభైరవుడు, దుర్గాదేవి, బ్రహ్మదేవుడు, కుమారస్వామి, దక్షిణామూర్తి, శ్రీరామలింగేశ్వరుడు, వీరభద్రస్వామి, శ్రీగోపాలుడు, రుక్మిణీ దేవి, సత్యభామ, సప్తమాతకలు మొదలైన వారు ఈ మండపాల్లో ఉన్నారు. కుడివైపున ఉన్న కోనేటికి త్రిశూల తీర్థమని పేరు. శ్రీమొగిలీశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం మాఘమాసంలో 11 రోజుల పాటు కనులపండువగా జరుగుతాయి.

తేనెపల్లిలో వీధినాటకం

పూతలపట్టు: మండల కేంద్రంలోని భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా వేకువజామున అభిషేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నామన్నారు. తేనేపల్లిలోని బాట గంగమ్మ ఆలయంలో శివరాత్రి సందర్భంగా భక్తులు అక్కడ జాగరణ చేయనున్నారు. ఈ సందర్భంగా వీధి నాటకం ఉంటుందని ఆ నిర్వాహకులు తెలిపారు.

నేడు మహాశివరాత్రి

మొగిలి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, వృషభ వాహన సేవ నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు.

కామధేను వాహనంపై..

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన శ్రీ ఏకాంబరేశ్వర స్వామి శుక్రవారం కామధేను వాహనంపై పురవీధుల్లో విహరించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ మూర్తులను సుగంధ పుష్పాలతో అలంకరించి కామధేను వాహనంపై పుర వీధులలో ఊరేగించారు. రాత్రి ఆదిశేష వాహనంపై శివపార్వతులను మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగించారు.

నంది, సింహ వాహనాలపై మొగిలీశ్వరుడు



మొగిలిలో అధికార నందివాహనంపై విహరిస్తున్న పరమేశ్వరుడు

బంగారుపాళెం: బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో రోజు శుక్రవారం ఉదయం మొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారు అధికార నంది వాహనాన్ని అధిరోహించి భక్తాదులకు దర్శనమిచ్చారు. అలంకార మండపంలో ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాల నడుమ ఆలయ మాడవీధుల్లో ఘనంగా ఊరేగించారు. దీనికి గాండ్లపల్లెకు చెందిన సాంబశివ నాయునివారు, వారి సోదరులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి ఆది శంకరుడైన మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారు సింహ వాహనంపై భక్తులను కనువిందు చేశారు. అభిషేకానంతరం స్వామి, అమ్మ వారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలం కరించి సింహవాహనంపై కొలువుదీర్చారు. ఈ ఉత్సవానికి మండల కేంద్రానికి చెందిన ఉషోదయా పాఠశాల యాజమాన్యం భారతి, ప్రతాప్ చంద్రనాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు.

లోకేష్ పాదయాత్ర ఎఫెక్ట్

- చిత్తూరు టీడీపీలో క్లస్టర్, యూనిట్ కమిటీలు రద్దు చేసిన అధిష్టానం
- షణ్ముగం రాజీనామాతో హుటాహుటిన నిర్ణయం

చిత్తూరు అర్బన్: నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర చిత్తూరు నియోజకవర్గంలో అట్టర్‌ఫ్లాప్ కావడంతో, ఆ పార్టీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. చిత్తూరు నియోజకవర్గంలో క్లస్టర్, యూనిట్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు టీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నియోజకవర్గానికి చెందిన పి.షణ్ముగంను రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటన వెనుక యువగళం ఫ్లాప్ కావడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇటీవల చిత్తూరు నగరానికి వచ్చిన లోకేష్ పాదయాత్రకు ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందనరాలేదు. తొలిరోజు నగరంలో తిరిగి, రెండోరోజు శిబిరానికే పరిమితమై, సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. ఆ బహిరంగ సభకూ పెద్దగా ఎవరూ రాలేదు. మరోవైపు బీసీలతో ముఖాముఖి నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకోగా, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని, బీసీ సెల్ నాయకుడు షణ్ముగంకు మధ్య వాగ్వాదం జరిగింది. కొంగారెడ్డిపల్లెకు చెందిన ఓ కార్పొరేటర్ భర్త, బీసీ నాయకుడు షణ్ముగంను కొట్టడానికి రావడంతో అందరి ముందు అవమానంగా భావించారు. ఇదే విషయాన్ని లోకేష్, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డికి చెప్పినా పట్టించుకోకపోవడంతో షణ్ముగం టీడీపీకు రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం మధ్యాహ్నం ప్రకటించారు. చిత్తూరు టీడీపీలో బీసీలకు అడుగడుగునా అవమానం జరుగుతోందని ప్రస్తావిస్తూ, ఆ వివరాలన్నింటినీ మీడియాకు వివరిస్తామని ప్రకటించారు. షణ్ముగం నోరువిప్పితే పార్టీ పరువుపోతుందని భావించిన స్థానిక నాయకులు విషయాన్ని టీడీపీ అధిష్టానానికి తెలియచేశారు. సాయంత్రం 5 గంటల తరువాత షణ్ముగంను బీసీ సెల్ విభాగం నుంచి తొలగిస్తున్నట్లు అచ్చెన్నాయుడు ప్రకటించారు. చిత్తూరు నగరంలో 50 డివిజన్లు ఉండగా, 2021లో ప్రతీ 5 డివిజన్లకు ఓ క్లస్టర్ ఇన్‌చార్జ్‌ను ఆ పార్టీ నియమించుకుంది. ప్రతీ 5 వేల ఓట్లున్న ప్రాంతాన్ని యూనిట్‌గా విభజిస్తూ దానికి కూడా ఓ ఇన్‌చార్జ్‌ను నియమించింది. అయితే పాదయాత్రను విజయవంతం చేయడంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఘోరంగా విఫలమవడంతో లోకేష్ ప్రజల్లో నవ్వులపాలయ్యాడు. ఈ నెపం ఎవరో ఒకరిపై నెట్టడానికి బీసీ నేత షణ్ముగంను, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లను తొలగించారు. ఇప్పటికీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ను నియమించకపోవడం టీడీపీలో నాయకత్వ లోటుకు అద్దం పడుతోంది.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



దేవరకొండ క్యాంప్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్

బంగారుపాళెం: స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు క్రమ శిక్షణ అవసరమని మాస్టర్ సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని మొగిలి దేవర కొండపై శుక్రవారం తుంబకుప్పం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ఒక్క రోజు క్యాంప్ నిర్వహించారు. విపత్కర సమయాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. క్రమ శిక్షణతో మెలిగి సమాజశ్రేయస్సుకు కృషి చేయాలని సూచించారు.

నందీశ్వరునిపై కాళభైరేశ్వరుడు



తవణంపల్లె: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నంది వాహనంపై శ్రీ కాళభైరేశ్వరుడు పుర వీధుల్లో ఊరేగారు. ఉదయం స్వామికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. దీనికి ఉభయదారులుగా వెంకటాచలపతి శెట్టి కుటుంబసభ్యులు వ్యవహరించారు. రాత్రి నంది వాహన సేవకు ఉభయదారులు వినాయక, దొరబాబు కుటుంబసభ్యులు పూజా సామగ్రి సమర్పించారు. ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం పల్లకిలో నందీశ్వరునిపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. శనివారం ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా స్వామికి అభిషేకం, అన్నదానం, మహా రుద్రాభిషేకం, అగ్నిగుండ ప్రవేశం, అఖండ కర్పూర హారతి, మృత్యుంజయ హోమం, లక్షబిల్వార్చన కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

అర్ధగిరి హనుమంతుని సేవలో ఎస్పీ



తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామిని శుక్రవారం సాయంత్రం స్పీ రిషాంత్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకటసుబ్బారెడ్డి, అర్చకులు సాదర స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం శేషవస్త్రాలతో ఎస్పీని సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

26న మొదలియార్ వివాహ పరిచయ వేదిక

తిరుపతి కల్చరల్: తిరుపతి మొదలియార్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉదయం 9.30 నుంచి గాంధీ భవన్ ట్రస్ట్‌లో మొదలియార్ వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి టి.వెంకటరమణ తెలిపారు. ఆయన శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి గల వారు రెండు పాస్ ఫొటోలు, జాతకంతో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివాహ పొంతనాలు పరిచయ వేదిక వద్దే ప్రముఖ జ్యోతిష్యులతో ఉచితంగా చెప్పించుకోవచ్చన్నారు. పాల్గొనే వారికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9394840579, 93933675757లో సంప్రదించాలని కోరారు.



గృహ సారథులకు బృహత్తర బాధ్యత

- సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేద్దాం
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల/తవణంపల్లె/యాదమరి: గృహ సారథులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బృహత్తరమైన బాధ్యతను అప్పగించారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ఆయన శుక్రవారం ఐరాల, తవణంపల్లె, యాదమరి మండలాల్లో సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐరాల మండలం వైఎస్ గేటు సమీపంలోని వీరాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయిన తర్వాత మార్చి 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ ఏడు రోజుల పాటు జగనన్నే మన భవిష్యత్ పేరుతో ప్రతి ఇంటికీ వెళ్లాలని చెప్పారు. ప్రతి కుటుంబంతో 15 నిమిషాలు మాట్లాడాలని సూచించారు. మా నమ్మకం నువ్వే జగన్ పేరుతో ముద్రించిన కరపత్రాలను అందించి, గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలు పూర్తిగా వివరించాలని స్పష్టం చేశారు. లంచంతో పని లేకుండా సంక్షేమ పథకాలు ఇంటికి చేరవేస్తున్న విషయమై ఐదు ప్రశ్నలను వారిని అడిగి సమాధాలు తెలుసుకున్న తర్వాత వారికి స్లిప్ ఇచ్చి మిస్డ్ కాల్ ఇప్పించాలన్నారు. వారి అనుమతితో ఆ ఇంటికి స్టిక్కర్లు అతికించాలని చెప్పారు. ప్రభుత్వం ఎంత మంచి చేస్తున్నా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయిని, అందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కుల మతాలకు అతీతంగా పదవులు, సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఐరాల: గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

తవణంపల్లెలో నిర్వహించిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గృహ సారథులు జగనన్న సైనికులుగా పనిచేసి అత్యధిక మెజార్టీతో పార్టీని గెలిపించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, మధుకుమార్, ఉమామహేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాలు

యాదమరిలోని శివపార్వతి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడారు. జగనన్న పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన విషయమై సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్ బాబు, వైస్ ఎంపీపీ హరి నారాయణ రెడ్డి, రవీంద్రబాబు, నాయకులు మనోహర్ రెడ్డి, మనోహరన్, యూత్ అధ్యక్షులు కార్తిక్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



యాదమరి: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

లోకేష్‌ది టైంపాస్ యాత్ర

నారా లోకేష్‌కు రాజకీయ అనుభవం లేదని, టైంపాస్ కోసం పాదయాత్ర చేస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు విమర్శించారు. లోకేష్ పాదయాత్రలో ప్రజల కష్టాల్లేవని చెబుతుండడంతో ఏమి చేయాలో అర్థం కాక ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు పాదయాత్రను పట్టించుకోకపోవడంతో తమిళనాడు నుంచి జనాన్ని తరలించే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.

